# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 14, మార్చి 2026


# కొత్త రైలు మంజూరు చేయండి

✧ కేంద్ర మంత్రి, రైల్వే బోర్డు

చైర్మన్లను కోరిన ఎమ్మెల్యే హరీష్‌బాబు



కాగజ్‌నగర్ రూరల్,

మార్చి 13, ప్రభాతవార్త

చర్లపల్లి నుండి సిర్పూర్ కాగజ్‌నగర్, నాగపూర్ మీదుగా హౌరా వరకు కొత్త రైలు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి, రైల్వే బోర్డు చైర్మన్లను సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు కోరారు. శుక్రవారం పార్లమెంట్ భవనంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రివర్యులు శ్రీ అశ్విని వైష్ణవ్‌ని కలిసి చర్లపల్లి నుండి సిర్పూర్ కాగజ్ నగర్, నాగపూర్ మీదుగా హౌరా వరకు కొత్త రైలును నడపాలని, కాజీపేట, మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్, చంద్రాపూర్, (మిగతా 2లో..)




# రాష్ట్రంలో గ్యాస్ సిలిండర్లకు కొరత లేదు

★ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

నిర్మల్, మార్చి 13, ప్రభాతవార్త:

రాష్ట్రవ్యాప్తంగా ప్రజల అవసరాలకు సరిపడా గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని, సరఫరాలో ఎలాంటి కొరత లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ నుండి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో కలిసి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. గ్యాస్ లభ్యతపై వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, తగినంత స్టాక్ అందుబాటులో ఉంచామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎక్కడా గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అలాగే పంటలకు అవసరమైన సాగునీరు కూడా సమృద్ధిగా ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుధాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో గృహ అవసరాల కొరకు ఎల్పిజి గ్యాస్ కొరత లేదు

✻ కలెక్టర్ కె.హరిత

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 13, ప్రభాతవార్త:



జిల్లాలో గృహ అవసరాల కుఎల్పిజి గ్యాస్ కొరత లేదని వినియోగదారులు ఎటువంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో నిల్వలను అందుబాటులో ఉంచినట్లు, ఎల్పిజి సిలిండర్లు పక్కదారి పట్టకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సరైన విధంగా సిలిండర్లు ఉపయోగించేటట్లు చూడడానికి ప్రత్యేక మానిటరింగ్ కమిటీ నియమించినట్లు తెలిపారు. ప్రజలు ఎవరు కూడా ముందస్తు బుకింగ్‌లు అవసరం లేదని, వినియోగదారుల అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నట్లు తెలిపారు. బుకింగ్ లు నిలువలపై రోజువారి సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకుంటామని, అటువంటివి ఎక్కడైనా సంభవిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. దీని కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఇది జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఆధ్వర్యంలో కొనసాగుతుందని 8500844365 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మరాదని తెలిపారు.

# విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

✦ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, మార్చి 13, ప్రభాతవార్త



విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్‌లో, నస్పూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఆకస్మికంగా సందర్శించి భోజనశాల, వంటశాల, అత్యవసర సామాగ్రి నిల్వలు, విద్యార్థుల హాజరు పట్టిక, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా (మిగతా 2లో..)

# మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

✣ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

నస్పూర్, మార్చి 13, ప్రభాతవార్త

ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ., ఏ.ఈ.ఆర్.ఓలతో ప్రత్యేక సమగ్ర సవరణ సంబంధిత మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులకు సహాయ సహకారాలు అందిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇందుకు గాను గ్రామ పాలన అధికారులు, ఇతర అధికారులను బూత్ స్థాయి అధికారులకు మ్యాపింగ్ లో సహాయకులుగా నియమించి ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి పార్టీ నుంచి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని, బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకులు, ఏఈఆర్ఓలు వారికి మ్యాపింగ్ చేయడంలో సహాయ సహకారాలు అందించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జరిగేలా పకడ్బందీగా ప్రక్రి య నిర్వహించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. మంచిర్యాల (మిగతా 2లో..)



## కొత్త రైలు మంజూరు చేయండి

(మొదటిపేజీ తరువాయి)

బల్లార్షా, నాగపూర్ ప్రాంతాల్లో ఉన్న బెంగాలీ ప్రజల సౌకర్యార్థం ఈ కొత్త రైలును మంజూరు చేస్తే వారికి చాలా ఉపయుక్తంగా ఉంటుందని విన్నవించారు. ఇదే విషయంపై రైల్వే బోర్డు చైర్మన్ శ్రీ సతీష్ కుమార్‌ను కలిసి కొత్త రైలు ప్రతిపాదన అందించడం జరిగిందని తెలిపారు. ఇరువురు త్వరలో ఈ కొత్త రైలు విషయంలో సానుకూలంగా ప్రకటన చేస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు.

## మట్టి నమూనాలను పరీక్షించి ఎరువులు వాడాలి

**- అధిక ఎరువుల వాడకంతో భూసారం దెబ్బతింటుంది**

**- అవగాహన సదస్సులో భీమారం వ్యవసాయ అధికారి ఏ.సుధాకర్**

చెన్నూరు, మార్చి 13, ప్రభాతవార్త



రైతులు ఇష్టానురీతిలో ఎరువులు వాడటం వలన భూసారం దెబ్బతిని దిగుబడిపై ప్రభావం పడుతుందని భీమారం మండల వ్యవసాయ అధికారి ఏ.సుధాకర్ అన్నారు. మంచిర్యాల జిల్లా భీమారం మండలం మద్దికల్ గ్రామ పంచాయతీలో ఆత్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేసుకోవాలని, అధిక రసాయన ఎరువులు వాడటం వలన భూసారం తగ్గుతుందని రైతులకు సూచించారు. భూసారాన్ని కాపాడుకోవడానికి పశువుల ఎరువు, వర్మీ కంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువుల వాడకాన్ని పెంచాలని రైతులకు వివరించారు. సూక్ష్మ పోషక లోపాల నివారణకు జింక్, బోరాన్ వాడాలన్నారు. సరైన సమయంలో నివారణ చర్యలు చేపట్టడం ద్వారా నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బొల్లంపల్లి అరుణ్ కుమార్, మద్దికల్ గ్రామ సర్పంచ్ పోతేమ్ సమ్మయ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## 16 నుంచి ఒంటి పూట బడులు ప్రారంభం

**- విద్యార్థులకు తప్పనున్న వేసవి ఇబ్బందులు**

ఉట్నూర్, మార్చి 13, ప్రభాతవార్త :

జిల్లాలో రోజురోజుకీ నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతల నేపథ్యంలో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. దీంతో ఈనెల 16వ తేదీ నుంచి ఒంటి పూట బడులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తాజా ఉత్తర్వుల ప్రకా రం ప్రతి రోజూ ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు కొనసాగనున్నాయి. జిల్లాలో 1,401 ప్రభు త్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1వ తరగతి నుంచి 9 వరకు 1,59,000 మంది విద్యార్థులు చదువుతున్నారు.

## విద్యార్థుల ఉన్నత చదువులకు తొలి మెట్టు పదవ తరగతి పరీక్షలు

జన్నారం, మార్చి 13, ప్రభాతవార్త

విద్యార్థులు ఎంత పెద్ద చదువులు చదవాలి అనుకున్న పదవ తరగతి పరీక్షలు తొలి మెట్టు లాంటివి అని అందుకే చాలా కష్టపడి చదవాలని మురిమడుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తంగడపల్లి అజయ్ అన్నారు. శుక్రవారం నాడు పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో రేణిగుంట కవిత,ప్రధానోపాధ్యాయులు అజయ్ దంపతులు పాఠశాలకు 25 వేల రూపాయల విలువ గల సౌండ్ సిస్టమ్ ను పాఠశాలకు విరాళంగా అందజేశారు. రేణిగుంట ఫౌండేషన్ ద్వారా పాఠశాల అభివృద్ధికి మా సహాయ సహకారాలు ఎల్లపుడూ ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అజయ్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని క్రమశిక్షణతో మంచి ఫలితాలు సాధించాలని, జీవితంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను,ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాదగిరి భారతి, ఉప సర్పంచ్ జగిశెట్టి రాజశ్రీ, పాఠశాల చైర్మన్ పద్మ, కలమడుగు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి,ఉపాధ్యాయులు అనుముల రాజన్న, కందుల తిరుపతి, గుమ్మడి అంకుష్, సురేష్ కుమార్, మహిళా ఉపాధ్యాయులు సాకేరే సుల్తానా, శంకరయ్య, రత్న, గౌరి, అక్కపల్లి గూడెం ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్, గాజుల చంద్రశేఖర్, పిఆర్‌టియు మాజీ మండల అద్యక్షులు సుధాకర్ నాయక్,విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




# మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని, జిల్లాలో ఇప్పటి వరకు 61.6 శాతం మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి అయిందని తెలిపారు. బూత్ స్థాయి అధికారులతో మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేలా పర్యవేక్షిస్తామని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా డూప్లికేట్ ఓట్ల తొలగింపుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫారం 6, 7, 8 ద్వారా అందిన దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అధికారుల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు, ప్రత్యేక ఉపపాలనాధికారి చంద్రకళ, తహసీల్దార్లు, ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అనేక చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులు, విద్యుత్, త్రాగునీరు, విద్యార్థిని విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందిస్తుందని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య ఈ సంవత్సరం 3 శాతం పెంపొందిందని, మరింత పెంపొందించేలా ఉపాధ్యాయులకు కృషి చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు విధుల పట్ల సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు.

మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు తీరును మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ తో కలిసి పరిశీలించారు. కార్యక్రమం అమలుపై గ్రామపంచాయతీ సర్పంచ్ లు, మున్సిపల్ కార్పొరేషన్/మున్సిపాలిటీ మేయర్/చైర్ పర్సన్లు, డిప్యూటీ మేయర్/ వైస్ చైర్ పర్సన్ లు, కార్పొరేటర్లు/ కౌన్సిలర్లకు శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. జూన్ 12వ తేదీ వరకు 99 రోజుల పాటు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి లలో కార్యచరణ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పారిశుధ్యం, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్ తదితర అంశాలపై కార్యాచరణ, సమాజ హిత అంశాలపై ప్రణాళికలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. సామాజిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, కార్యక్రమంలో భాగంగా 2, 3 వార్డులలో 3, 4 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రజా ప్రతినిధులు కార్యక్రమాలలో పాల్గొని ప్రజలను భాగస్వామ్యులను చేయాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ నిరంతరాయంగా కొనసాగించాలని తెలిపారు.

అనంతరం మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి జిల్లాలో జాతీయ రహదారి విస్తరణ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన భూసేకరణకు సంబంధించి అందిన దరఖాస్తుల పరిష్కారం వివరాలను పరిశీలించారు. అభివృద్ధిలో భాగంగా భారత జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన 63, 163జి రహదారుల ఏర్పాటులో భాగంగా జిల్లాలోని దేవులవాడ, మందమర్రి, తిమ్మాపూర్, కోటపల్లి ప్రాంతాలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కార చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల అధికారులు ఉపాధ్యాయులు, 14వ డివిజన్ కార్పొరేటర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు తిప్పారపు సారయ్య, ఇతర నాయకులు

## సింగరేణి కార్మికుల పక్షపాతి కవిత: తిప్పారపు సారయ్య

**- వృద్ధాశ్రమంలో ఘనంగా పుట్టినరోజు వేడుకలు**

నస్పూర్, మార్చి 13, ప్రభాతవార్త

మంచిర్యాల నగర పాలక సంస్థ పరిధిలోని సిసిసి శ్రీ సాయి వృద్ధాశ్రమంలో తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, హెచ్ఎంఎస్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పుట్టినరోజు వేడుకలు జరిగాయి. హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆశ్రమ వృద్ధులతో కేకు కట్ చేయించి, వారికి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్మిక హక్కుల సాధనలో కవిత పోషిస్తున్న పాత్రను ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. ముఖ్య అతిథిగా హాజరైన హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు తిప్పారపు సారయ్య మాట్లాడుతూ కల్వకుంట్ల కవితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమె భవిష్యత్తులో చేపట్టే పోరాటాలకు హెచ్ఎంఎస్ యూనియన్ పూర్తి అండగా ఉంటుందని ప్రకటించారు. కవిత చేసిన కృషి వల్లే సింగరేణిలో సుమారు 19 వేల మంది యువ కార్మికులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు లభించాయని గుర్తు చేశారు. సింగరేణి పరిరక్షణ, కార్మిక హక్కుల సాధన కోసం కార్మిక వర్గం అంతా ఆమెకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి, బ్రాంచ్ సెక్రటరీ పొనగంటి అశోక్, ఎస్‌టిపిపి నాయకులు విక్రమ్, ప్రదీప్ రెడ్డి, రేగుంట సందీప్, దుర్గం లక్ష్మణ్, మీసాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ తోఫాల పంపిణీ

హాజీపూర్, మార్చి 13, ప్రభాతవార్త

రంజాన్ పండుగను పురస్కరించుకొని కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున మండల కేంద్రంలో ముస్లిం మహిళలకు రంజాన్ తోఫాలను మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల. సురేఖ పంపిణీ చేశారు. మండలంలోని పేద ముస్లిం కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ తరఫున సుమారు 150 మంది ముస్లిం మహిళలకు రంజాన్ కానుకలు అందజేశారు. ప్రతి కుటుంబానికి ఒక చీరతో పాటు సేమియా కిట్, నెయ్యి, పాలు, జీడిపప్పు, కిస్మిస్, చక్కెర, కర్జూరాలు, 5 కిలోల బియ్యంతో కూడిన రంజాన్ తోఫాలను అందించారు.ఈ సందర్భంగా కొక్కిరాల సురేఖ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పవిత్ర రంజాన్ మాసంలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుక అందించడం ట్రస్ట్ సంప్రదాయంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఉపవాస దీక్షలతో పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగ సమయంలో ముస్లిం సోదరీమణులు ఆనందంగా పండుగను జరుపుకోవాలన్నదే తమ ఆకాంక్ష అని పేర్కొన్నారు.ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఆనందంగా, శాంతి–సౌహార్ద్ర వాతావరణంలో జరుపుకోవాలని కోరుతూ అందరికీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల కార్పొరేషన్ 17వ డివిజన్ కార్పొరేటర్ లగిశెట్టి రాజయ్య, 18వ డివిజన్ కార్పొరేటర్ రాసామల్ల కమలశ్రీనివాస్ గౌడ్, సర్పంచులు మిట్టపల్లి రాంరెడ్డి,బూర్ల తిరుపతమ్మ, తిరుపతి,బొడ్డు. భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ తోఫాలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

# విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

**★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**లక్షెట్టిపేట, మార్చి 13, ప్రభాతవార్త**

విద్యార్థులు విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడారంగంలో రాణించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం సాయంత్రం లక్షెట్టిపేట మండల కేంద్రంలో గల ఆర్.కె. పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథి కొక్కిరాల సురేఖతో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో, క్రీడా రంగంలో రాణించాలని తెలిపారు. ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని పట్టుదలతో సాధించాలని, ఎంచుకున్న ప్రతి రంగంలో ప్రతిభ కనబరచాలని తెలిపారు. విద్య భవిష్యత్తుకు బలమైన పునాది అని, ఏ రంగంలోనైనా రాణించడానికి విద్య ఖచ్చితంగా అవసరమని, తెలిపారు. క్రమశిక్షణ, కృషి ఉంటే విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని, పాఠశాలలు విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికితీసే వేదికలుగా నిలవాలని తెలిపారు. విద్యార్థులు గురువుల మార్గదర్శకత్వంలో లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను అతిథులు ఆసక్తిగా వీక్షించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వేదికపై కూర్చున జిల్లా కలెక్టర్, మాజీ డిసిసి అధ్యక్షురాలు




వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## ఆదిలాబాద్-దహిగూడకు బస్సు సౌకర్యం కల్పించాలి

**ఆదిలాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:**

ఆదిలాబాద్-దహిగూడకు బస్సు సౌకర్యం కల్పించాలని వాన్వట్ సర్పంచ్ మెస్రం భుజంగ్‌రావు, పిప్పల్‌ధరి మండల సాధన కమిటి అధ్యక్షులు తెలంగ్ బాపురావ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ ఆర్టిసి డిపో మెనెజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి, అంకోలి, లోకారి, వాన్వట్, లింగుగూడ, మామిడిగూడ, పిప్పల్‌ధరి మీదుగా దహిగూడ వరకు బస్సు సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆదిలాబాద్-దహిగూడకు డబుల్ రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ బస్సు సౌకర్యాం లేదన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకం లబ్ధిపొందే అవకాశం ఉంటుందని తెలిపారు. డిపో మెనేజర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే బస్సును పంపిస్తామని, ప్రయాణికులు ఉపయోగించుకోని సహాకరించుతే బస్సును నిరంతరం కొనసాగిస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిప్పల్‌ధరి సర్పంచ్ కుమ్ర లక్ష్మీ, కాంగ్రెస్ నాయకులు మినుగు నారాయణ, పిప్పల్‌ధరి మండల సాధన కమిటి న్యాయ సలహాదారులు తెలంగ్ అజయ్ కుమార్, యువ నాయకులు కినక నందకిశోర్, కుమ్ర శంకర్, ఆత్రం జంగు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఆడే గజేందర్

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఆడే గజేందర్

**నేరడిగొండ, మార్చి 13, ప్రభాతవార్త:**

బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ శుక్రవారం నేరడిగొండ మండలంలోని కుంటాల (కె) గ్రామాన్ని సందర్శించారు. సత్నాల తహసీల్దార్ రామరావు తండ్రి నెమ్యా నాయక్ ఇటీవలే మరణించిన విషయం తెలుసుకున్న ఆయన, మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నెమ్యా నాయక్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్న గజేందర్, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిర్మల్ హోటళ్లలో తనిఖీలు

**- 29 డొమెస్టిక్ సిలిండర్లు స్వాధీనం**

**నిర్మల్, మార్చి 13, ప్రభాతవార్త:**

నిర్మల్ పట్టణంలోని పలు హోటళ్లలో శుక్రవారం పౌరసరఫరాల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ దాడుల్లో 16 హోటళ్లను తనిఖీ చేయగా, నిబంధనలకు విరుద్ధంగా వాడుతున్న 29 గృహావసరాల సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. గృహావసరాల కోసం కేటాయించిన సిలిండర్లను వ్యాపార అవసరాలకు ఉపయోగించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఎవరైనా డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు తప్పనిసరిగా కమర్షియల్ సిలిండర్లనే వాడాలని సూచించారు.




సిలిండర్లను స్వాధీనం చేసుకుంటున్న పౌరసరఫరాల అధికారులు



ఫుడ్ ఫెస్టివల్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ కరిపే రవళి విలాస్

## ప్రశాంతంగా పరీక్షలు రాయండి: సర్పంచ్ బడి పోతన్న

**సారంగాపూర్, మార్చి 13, ప్రభాతవార్త:**

మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం హాల్ టికెట్లను పంపిణీ చేశారు. ధని గ్రామంలోని పాఠశాలలో సర్పంచ్ బడి పోతన్న విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. మార్కుల విషయంలో ఆందోళన చెందవద్దని, తల్లిదండ్రులు కూడా పిల్లలపై ఒత్తిడి తీసుకురావద్దని ఆయన కోరారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సలోమి కరుణ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పది తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

**చింతలమానేపల్లి, మార్చి 13, ప్రభాతవార్త:**

పదవ తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి భయాందోళనలు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు నూకల శ్రీధర్, కోట సాయిక్రిష్ణ, నూకల పవన్, జయరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## పాఠశాలలో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

**సారంగాపూర్, మార్చి 13, ప్రభాతవార్త:**

మండలంలోని జాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ కరిపే రవళి విలాస్ విద్యార్థులు సిద్ధం చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఈ దశలో పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. శరీరానికి అవసరమైన పోషక పదార్థాలు అందేలా సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు సర్పంచ్ చేతుల మీదుగా హాల్ టికెట్లను పంపిణీ చేశారు. పరీక్షల సమయంలో ఒత్తిడికిలోను కాకుండా ప్రశాంతంగా రాయాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్ధన్, ఉపసర్పంచ్ గంగాధర్, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డిగ్రీ పరీక్ష ఫీజు సకాలంలో చెల్లించండి

**నేరడిగొండ, మార్చి13, ప్రభాతవార్త:**

కాకతీయ యూనివర్సిటీ వారి రెండవ, నాల్గవ, ఆరవ సెమిస్టర్‌కి సంబంధించిన పరీక్ష ఫీజు గురువారం కాకతీయ యూనివర్సిటీ వారు విడుదల చేయడం జరిగింది. ఈ విషయాన్ని డిగ్రీ విద్యార్థిని విద్యార్థులు గమనించి సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించాలని సాయి చైతన్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సామ రాజ్ కిరణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కొరకు 951535394905, 901443055, 901445010. ఈ నెంబర్లకు ఫోన్ చేయగలరు.



విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేస్తున్న సర్పంచ్ బడి పోతన్న



విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేసిన ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఉపాధ్యాయులు



పరామర్శిస్తున్న బలరాం జాదవ్

## ప్రమాదానికి గురైన బాధిత మహిళను పరామర్శించిన బలరాం జాదవ్

ఇచ్చోడ, మార్చి 13, ప్రభాతవార్త:

సాంఘిక సంక్షేమ వసతి గృహంలో వంట చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు వేడి నీటిలో పడి తీవ్రంగా గాయపడిన దుబ్బాక సుభాష్ మాతృమూర్తిని రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ పరామర్శించారు. ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన ఆమె, విధుల్లో ఉండగా జరిగిన ఈ ప్రమాదంలో శరీరం బాగా కాలిపోవడంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న బలరాం జాదవ్ శుక్రవారం వారి నివాసానికి వెళ్లి బాధితురాలిని పలకరించారు. ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకుని, ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉండాలని ఆయన కోరారు.




వండర్లా వాటర్ పార్క్ వివరాలను వెల్లడిస్తున్న నిర్వాహకులు

## నిర్మల్ వండర్లా వాటర్ పార్క్ ప్రారంభం

నిర్మల్, మార్చి 13, ప్రభాతవార్త:

వేసవి కాలంలో జిల్లా ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు అన్ని హంగులతో సిద్ధమైన నిర్మల్ వండర్లా వాటర్ పార్క్ ఈ నెల 15వ తేదీన ప్రారంభం కానుంది. నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు డాక్టర్ ప్రమోద్ చంద్ర రెడ్డి, నూకల గురు ప్రసాద్, గంగిశెట్టి ప్రవీణ్ కుమార్ తదితరులు ఈ వివరాలను వెల్లడించారు. సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో, అత్యాధునిక హంగులు, పూర్తిస్థాయి భద్రతా ప్రమాణాలతో ఈ వాటర్ పార్కును ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ప్రభుత్వం నుండి అవసరమైన అన్ని రకాల అనుమతులు, ధృవీకరణ పత్రాలు పొందామని పేర్కొన్నారు. విద్యార్థులు, పెద్దలు, కుటుంబ సభ్యుల కోసం ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. వేసవి సెలవుల్లో దూర ప్రయాణాలు చేయాల్సిన అవసరం లేకుండా, నిర్మల్‌లోనే అంతర్జాతీయ స్థాయి వినోదాన్ని అందిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఆర్కిటెక్ట్ జాదవ్, మార్కెటింగ్ మేనేజర్ డాక్టర్ కత్తి కిరణ్ హరిహర, ఈవెంట్ డైరెక్టర్ ఆడిచర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.థ

## ఆర్ఐను బదిలీ చేయాలంటూ తహశీల్దార్‌కు వినతి పత్రం

చింతలమానేపల్లి, మార్చి 13, ప్రభాతవార్త:

మండల రెవెన్యూ కార్యాలయంలోని ఆర్ఐ రాజేష్ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం బీజేపీ, బీఆర్ఎస్, నాయకులు తహశీల్దార్ వెంకటేశ్వరరావు కు ఫిర్యాదు చేసి వినతి పత్రం అందచేశారు. దరఖాస్తుదారులను కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటూ, లంచం ఇస్తేనే పనులు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఫైళ్లు మాయం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న సదరు అధికారిని వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న రాజేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, మురళీ, సాగర్, అంకులు, పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

# పచ్చని పల్లెలు ప్రగతికి సోపానాలు: అడిషనల్ కలెక్టర్

జైపూర్, మార్చి 13, ప్రభాతవార్త

పచ్చని పల్లెలు ప్రగతికి సోపానాలు అని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య అన్నారు. శుక్రవారం అడిషనల్ కలెక్టర్ జైపూర్ మండలంలోని రామారావు పేట గ్రామ పంచాయతీని ఆకస్మికంగా సందర్శించారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో బాగంగా షెడ్యూల్ ప్రకారం గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను, చెరువులను శుభ్ర పరచడం, డ్రైడే ఆక్టివిటీస్, గ్రామంలోని అన్ని కాలనీలలో సందర్శించి, రోడ్లు, డ్రైన్లు శుభ్రం చేయించి అవసరమైన చోట బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని ఆదేశించారు. గ్రామంలోని మురికి కాలువలో ఎక్కడ కూడా మిషన్ భగీరథ పైప్ లైన్లు ఉండకూడదని ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి ఎప్పటికప్పుడు ఫోటో క్యాప్చర్ చేస్తూ పురోగతి రావాలని కార్యదర్శిని ఆదేశించారు. పర్యటనలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, మండల పంచాయతీ అధికారి బాబురావు, సర్పంచ్ పులి రాజశేఖర్, ఉప సర్పంచ్ నామాల నాగరాజు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి డి.రజిత అంగన్వాడీ ఉపాధ్యాయినిలు విజయ, జ్యోతి, అంజలి, సరిత, ఏ.ఎన్.ఎం, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.




## జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన సింగరేణి అధికారి తనయుడు దరావత్ ధనుష్

### - ఏప్రిల్ 16 నుండి ఢిల్లీలో జాతీయ స్థాయి పోటీలు

జైపూర్, మార్చి 13, ప్రభాతవార్త




బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్న జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ లో ఈ అండ్ఎం విభాగంలో విధులు నిర్వహిస్తున్న అధికారి దరావత్ పంతులా తనయుడు ధరావత్ ధనుష్ అండర్ 17 బాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఏప్రిల్ 16 నుంచి ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి అండర్17 విభాగం లో ధనుష్ ఆడనున్నాడు. 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్ లెవల్ టోర్నమెంట్ కమ్ సెలెక్షన్స్ 2025-26 అండర్ 17 బాలురు, బాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈ నెల 11 నుంచి 12 వరకు మెదక్ జిల్లా సంగారెడ్డి లో జరిగాయి. ఈ పోటీల్లో మంచిర్యాల జిల్లాకు చెందిన ధరావత్ ధనుష్ విశిష్ట ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన ప్రతిభావంతులైన క్రీడాకారుల మధ్య జరిగిన ఈ పోటీల్లో ధనుష్ అద్భుతమైన ఆటతీరు ప్రదర్శించి రాష్ట్ర స్థాయిలో తన ప్రతిభను చాటుకున్నాడు. కఠినమైన శ్రమ, పట్టుదలతో నిరంతరం సాధన చేస్తూ జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం విశేషం. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్-2025 బ్యాడ్మింటన్ పోటీల్లో ధనుష్ రెండు పతకాలు సాధించి తన ప్రతిభను మరోసారి నిరూపించాడు. వరుస విజయాలతో జిల్లాకు గర్వకారణంగా నిలుస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగే క్రీడాకారుడిగా గుర్తింపు పొందుతున్నాడు. ఈ విజయం సింగరేణి సంస్థ, ఎస్టీపిపి, సింగరేణి కుటుంబ సభ్యులకు గర్వకారణంగా నిలిచింది. వరుస పథకాలు సాధిస్తూ, రాణిస్తున్న ధనుష్‌ను చూసి కోచ్ నరేందర్ హైదరాబాద్‌లోని గరుడ బ్యాడ్మింటన్ అకాడమీ మేనేజ్‌మెంట్ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పోర్ట్స్ ఆఫీసర్ యాకూబ్, మంచిర్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి సుధాకర్‌లు ధనుష్‌ను అభినందించారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా: దుబ్బుల నానయ్య

చింతలమానేపల్లి, మార్చి 13, ప్రభాతవార్త:

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మాజీ ఎంపీపీ దుబ్బుల నానయ్య పార్టీ ఆదేశాల మేరకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఎమ్మెల్సీ దండే విట్టల్ ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఆయనను మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రమాదవశాత్తు కింద పడి వృద్ధురాలు మృతి

మందమర్రి, మార్చి 13, ప్రభాతవార్త



మందమర్రి పట్టణంలోని రెండవ జోన్ ప్రాంతంలో నివాసం ఉంటున్న జక్కనబోయిన లక్ష్మి (80) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు కింద పడటంతో మృతి చెందిన ఘటన చోటుచేసుకున్నట్లు మందమర్రి ఎస్ఐ జి. నరేష్ తెలిపారు. మృతురాలి కుమారుడు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మి మందమర్రి పట్టణంలోని తన స్వగృహంలో ఒంటరిగా నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో మార్చి 12వ తేదీ రాత్రి సుమారు 11 గంటల సమయంలో, అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న ఎండి. రసూల్ అనే వ్యక్తి శ్రీనివాస్‌కు ఫోన్ చేసి లక్ష్మి ఇంటి గడప వద్ద కిందపడి ఉన్నారని సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే అక్కడికి చేరుకుని పరిశీలించగా, ఇంటి గడపకు తగిలి కింద పడటంతో తలకు తీవ్ర గాయమై ఆమె మృతి చెందినట్లు గుర్తించారు. మృతురాలి కుడి చేతి పైన ఏదో జంతువు కరిచినట్లు గాయాలు ఉన్నాయని కుమారుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## దోమల నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరం

### - జనగామలో అవగాహన కార్యక్రమం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కోటపల్లి, మార్చి 13, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం జనగామ గ్రామ పంచాయితీలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మార్చి 6 నుండి జూన్ 2 వరకు నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమంలో భాగంగా దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల ఉధృతి తగ్గుతుందని వివరించారు. ముఖ్యంగా కుండలు, డబ్బాలు, టైర్లు, ట్యాంకులు వంటి చోట్ల నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారిశెట్టి పద్మ, మాజీ ఎంపీటీసీ మారిశెట్టి తిరుపతి, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఆశా వర్కర్ రాజ్ బి, మల్టీ పర్పస్ వర్కర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేస్తున్న విఎన్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

నస్పూర్, మార్చి 13, ప్రభాతవార్త

నస్పూర్ మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు విఎన్ఆర్ ఫౌండేషన్, అల్ఫోర్స్ జూనియర్ కాలేజీల చైర్మన్ వి. నరేందర్ రెడ్డి సహకారంతో శుక్రవారం పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విఎన్ఆర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లెత్తుల రాజేంద్రపాణి మాట్లాడుతూ, పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటి పాఠశాలలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో విఎన్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు రేగళ్ల ఉపేందర్, కలవల శ్రీనివాస్, సంధినేని శ్రావణ్, గోపతి తిరుపతి పాల్గొన్నారు.



## అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

జన్నారం, మార్చి 13, ప్రభాతవార్త

వేసవి కాలం వచ్చిందంటే ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా శుక్రవారం రోజు జన్నారం మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మండల ఫైర్ అధికారి దేవనంది శ్రీనివాస్ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలు జరిగి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వేసవికాలంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ ప్రమాదాలు ఎల్పిజి గ్యాస్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్ అధికారి శ్రీనివాస్ వివరించారు. అగ్నిప్రమాదంలో చిక్కుకున్నవారిని ఎలా కాపాడాలో, వారికి శ్వాస అందకుంటే శ్వాస ఎలా అందించాలి, తదితర అంశాలపై ప్రాక్టికల్ గా చేసి వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సతీష్, వినోద్, ప్రశాంత్, కళ్యాణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు శెట్టి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఉత్పత్తిదారుల సంఘంలోకి కొనసాగుతున్న సభ్యత్వాలు

వేమనపల్లి, మార్చి 13, ప్రభాతవార్త



నీల్వాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఎఫ్ పిఓ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలో సభ్యత్వం స్వీకరణలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మాజీ జెడ్పిటిసి ఆర్ సంతోష్ కుమార్ సభ్యత్వం స్వీకరించారు. ఎఫ్పిఓలో చేరేందుకు సభ్యత్వం ఫీజు రూ.2 వేలు కాగా ప్రతి సభ్యుడు ఈక్విటీ గ్రాండ్ కింద రెండు వేలు జమ చేయాల్సి ఉంటుంది. సభ్యులుగా చేరిన రైతులకు భవిష్యత్తులో ప్రభుత్వం అందించే పథకాలు, రుణ సౌకర్యాలు, మార్కెటింగ్, సహాయం, శిక్షణ కార్యక్రమాలు లభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కావున అర్హత ఉన్న రైతులందరూ రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యులుగా చేరి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్టర్ కే రవీందర్రావు, పిఎసిఎస్ కార్యదర్శి రాజు నాయక్ ఉన్నారు.

### మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని

# యధావిధిగా కొనసాగించాలి

- విబిజీరామ్‌జీ బిల్లును రద్దు చేయాలి
- ఉపాధి హామీ పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 13, ప్రభాతవార్త

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించి విబిజీరామ్‌జీ బిల్లును రద్దు చేయాలని అదే విధంగా ఉపాధి హామీ పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలంలోని కోయవాగు గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పని ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జాతీయ ఉపాధి హామీ పథకంను కేంద్రంలోని బీజేపీపేరు విబిజి రాంజీ పేరును మార్చుతు కేంద్రం 90 శాతం, రాష్టం 10శాతం నిధులను భరించే నిబంధనలను మర్చి కొత్త చట్టం తేవడం ద్వారా కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40శాతం నిధులను భరించాలనే దానితో రాష్ట్రాల్లో ఆదాయంలు తగ్గుతున్న తరుణంలో ఇవిదంగా అదనంగా కేంద్రం బారాలు మోపడం సిగ్గు మాలిన చర్య గా ఉన్నదని దుయ్యాబాట్టరు. అలాగే సంక్రాతి పండగ నుంచి కూలి పనులు చేస్తున్న కూలి డబ్బుల బకాయిలు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పని ప్రదేశాలలో కనీస వసతులు లేవని, అన్ని వసతులు కల్పించాలని పోరాటం స్పెషల్ వస్తుందని అన్నారు. సౌకర్యం ఏర్పాటు చేయాలనీ ఉన్న ఇక్కడ అటువంటి కనీస వసతులు ఎందుకు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. రోజు కూలి 307కాకుండా 800ఇవ్వాలని డీమాండ్ చేశారు ప్రతి ఏడాదికి 200రోజుల పనిదినా లు కల్పించాలని డీమాండ్ చేశారు. ఉపాధిపనికిఏడాదికి 2లక్షల కోట్లు బడ్జెట్ కేటాయిచాలని కోరారు. పని ప్రదేశంలోరోజు కూలీలకు ఓ ఆర్ యస్ ప్యాకేట్ లు అందించాలని సూచించారు. అలాగే పనిముట్లు తట్ట, పారా, సభల్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ (మెడికల్ కిట్)లు ఇవ్వాలని డీమాండ్ చేశారు. వామ పక్షాల మద్దతుతో వచ్చిన ఉపాధి పతకం ను బీజేపీ క్రమేననిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్ను తున్నదనితెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు మెట్లు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ముంజం ఆనంద్‌కుమార్



పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంఈఓ వాలాసా ప్రభాకర్

## నేటి నుండి పదో తరగతి పరీక్షలు

**- కాగజ్‌నగర్ మండలంలో ఎనిమిది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు**

**- ఏర్పాట్లను పరిశీలించిన మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్**

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 13, ప్రభాతవార్త :

కాగజ్‌నగర్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నేటి నుండి నిర్వహించబోయే పదవ తరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కాగజ్‌నగర్ మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరం మండలంలో 8 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 8 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 8 మంది డిపార్ట్మెంట్ ఆఫీసర్లు, 96 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలకు 1596 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు, విద్యుత్తు, ఫర్నిచర్, మరుగుదొడ్లు వంటి అన్ని వసతులను ఏర్పాటు చేసినట్లు, విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా పరీక్షలు ప్రశాంతంగా రాయాలని సూచించారు. పరీక్షలు ఈనెల 14 నుండి వచ్చేనెల ఏప్రిల్ 13 వరకు ప్రతి రోజు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులందరూ ఉదయం 8:30 గంటల వరకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, 5 నిమిషాల ఆలస్యంతో 9:35 గంటల తర్వాత విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లో పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని, ఇట్టి విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని సూచించారు.

## రంజాన్ తోఫా పంపిణీ చేసిన మాజీ డిసిసి అధ్యక్షురాలు సురేఖ

లక్షెట్టిపేట, మార్చి 13, ప్రభాతవార్త



రంజాన్ పర్వదిన పండుగ సందర్భంగా కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల లక్షెట్టీపేట మున్సిపాలిటీ పరిధిలోని ఐబీ గెస్ట్ హౌస్‌లో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరీమణులకు రంజాన్ తోఫాను మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ... గత ఏడు సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ముందుగా ముస్లిం సోదరీమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొంత అంజలినర్సయ్య, వైస్ చైర్మన్ మోత్కూరు రాజేశ్వరి వెంకట స్వామి గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చింత అశోక్ కుమార్, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, మండల నాయకులు, మహిళా నాయకురాలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగం తగ్గించాలి, గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి: అదనపు కలెక్టర్

జైపూర్, మార్చి 13, ప్రభాతవార్త



ప్రజా పాలన 99 ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రయ్య మండలంలోని ఇందారం, గ్రామపంచాయతీని సందర్శించారు. ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న డ్రై డే పరిశీలించారు. గ్రామ పంచాయతీలు ఖచ్చితంగా డ్రైడే నిర్వహించాలని సూచించారు. గ్రామంలో ప్రతిరోజు పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించి, రోడ్లు కాలువలను శుభ్రం చేసి గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. త్రాగునీటి సరఫరాకొరకు మోటార్లకు ఉపయోగించే విద్యుత్ వినియోగాన్ని తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని, ప్రతిరోజు ఉదయం 2 గంటలు సాయంత్రం 1 గంట అవసరం ఉన్న మేరకు బోర్లను వాడాలన్నారు. కరెంటు వినియోగాన్ని తగ్గించాలని, ప్రతి నల్లాకు ఆన్ ఆఫ్ బిగించాలని గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ పర్యటనలో ఎంపిడిఓ సత్యనారాయణ, ఎంపీఓ బాపు రావు ఇందారం రామారావు పేట గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ లుఫయాజుద్దీన్, పంచాయతీ కార్యదర్శులు వార్డు సభ్యులు అంగన్వాడీలు ఏ.సుమన్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# నేలతల్లిని రసాయనాల నుంచి విముక్తి చేయాలి

**★ సంప్రదాయ విత్తన పునరుజ్జీవనం, నేల ఆరోగ్య పరిరక్షణ సదస్సు**

**కెరమెరి,మార్చి 13, ప్రభాతవార్త**



మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

నేల తల్లిని రసాయనాల నుండి విముక్తి చేయాలని జలజీవిక సంస్థ ప్రతినిధులు బొజ్జ పద్మాకర్ కేంద్రీ బాలాజీ అన్నారు. కుమరం భీమ్ సెంద్రీయ ఉత్పాదక రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో, సెంటర్ ఫర్ అక్వాటిక్ లైవ్లీహుడ్ (జలజీవిక) సహకారంతో శుక్రవారం కెరమెరి మండలం పెద్ద సాకేడ గ్రామంలో సంప్రదాయ విత్తనాల పునరుజ్జీవనం నేల ఆరోగ్య పరిరక్షణ అనే అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. విత్తన బ్యాంకు ఏర్పాటు. మన పూర్వీకులు అందించిన స్వదేశీ విత్తన రకాలను సేకరించి, వాటిని భావి తరాలకు అందించేలా ఒక కమ్యూనిటీ సీడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని ఎన్‌బిపిజిఆర్ ప్రతినిధి డా.చేతన్ కుమార్ అన్నారు. నేటి ఆధునిక వ్యవసాయ కాలంలో కనుమరుగవుతున్న మన పూర్వీకుల విత్తనాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. నేల ఆరోగ్యం హానికరమైన రసాయనాలు లేకుండా, సంప్రదాయ విత్తనాల ద్వారా భూమిని ఎలా సారవంతం చేయవచ్చో ఇక్రిసాట్ నిపుణులు,సురేందర్ హార్వెస్ట్ ప్లస్ ప్రతినిధి వివరించారు. మన నేల మన సంప్రదాయ విత్తనాల రక్షణ మన బాధ్యత అనే నినాదంతో ముందు కు సాగలని కుమర విట్టల్ రావ్ అన్నారు.నేలను నాశనం చేసే జాతి తనను తాను నాశనం చేసుకుంటుంది.. విత్తనాన్ని దాచుకున్న రైతే తన భవిష్యత్తును కాపాడుకోగలడు అని అతిథులు ఈ సందర్భంగా గుర్తు చేశారు. మన పొలాలు మళ్ళీ పచ్చగా, మన నేలలు బంగారంగా మారాలంటే ప్రతి రైతు విత్తన సేకరణలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ సదస్సులో హార్వెస్ట్ ప్లస్ ప్రతినిధి శ్రీ సురేందర్ ఇక్రిసాట్ నుండి వేణుగోపాల్, సి సి డి ప్రతినిధులు కుమ్ర విఠల్ రావు, శేషారావు, ఎఫ్ బి ఓ చైర్మన్ బాలాజీ, జలజీవిక ఎన్జీవో ప్రతినిధి పద్మాకర్ బొజ్జ, కిషొర్,అభితంజలి ,ఫెద్ద సాకెడ సర్పంచ్ లచ్చు,జారి సర్పంచ్ మొతుబాయి తో పాటు జ్ఞానేశ్వర్,రాంచందర్,డెవురవ్,రాము పెద్ద సంఖ్యలో రైతులు మరియు మహిళలు పాల్గొన్నారు.



ట్యాంక్‌ను శుభ్రపరుస్తున్న మున్సిపల్ కమిషనర్ తిరుపతి

## నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి

**- మున్సిపల్ కమిషనర్ తిరుపతి**

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 13, ప్రభాతవార్త**

నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవాలని దీంతో ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని కాగజ్‌నగర్ మున్సిపల్ కమీషనర్ తిరుపతి అన్నారు. శుక్రవారం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో నీటి ట్యాంకుల శుభ్రతపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి. తిరుపతి స్వయంగా నీటి ట్యాంకును శుభ్రపరిచి, ట్యాంకులను ఎలా శుభ్రంగా ఉంచుకోవాలో సిబ్బందికి, ప్రజలకు వివరించారు. నీటి ట్యాంకులను నిరంతరం శుభ్రపరచడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ బైరిసెట్టి రవి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామాదేవి, ఏఈ నవీన్ కుమార్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ డి. ప్రణీల్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. శంకర్,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్యాడ్లను అందజేసిన సర్పంచ్

## భయాన్ని విడిచి ధైర్యంగా పరీక్షలు రాయాలి: సర్పంచ్ సులోచన

**- విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్ల పంపిణీ**

**పెంచికల్‌పేట్, మార్చి 13, ప్రభాతవార్త :**

విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కమ్మర్గం సర్పంచ్ కొండ్ర సులోచన అన్నారు. శుక్రవారం గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో జరగబోయే పదవ తరగతి పరీక్షలను భయభ్రాంతులకు గురికాకుండా ధైర్యంగా రాయాలని సూచించారు. క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

**పెంచికల్ పేట్, మార్చి 13, ప్రభాతవార్త :**

పెంచికల్ పేట్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు మండల అధికారులు హాల్ టికెట్లను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు భయాందోళనలకు లోనుకాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు. క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చివరి సూచనలు తెలియజేస్తూ పరీక్షల్లో విజయాన్ని సాధించేందుకు ప్రోత్సాహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఆల్బర్ట్, ఎంపీఓ మహేందర్, సర్పంచ్ రాంచందర్, ఎస్సై అనిల్ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది, కార్యదర్శి,పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్

**లక్షెట్టిపేట, మార్చి 13, ప్రభాతవార్త**



ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా అనకాపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంను సర్పంచ్ లింగంపల్లి లతా –వెంకటేష్ సందర్శించారు. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ.. ఫీడింగ్, ఇచ్చే విధానాలు అదేవిధంగా ప్రతి ఒక్కరు తప్పకుండా కేంద్రానికి వచ్చి ఫుడ్ తీసుకొని పోవాలని అన్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ పరిధిలోని ఉపాధి హామీ పనులను పరిశీలించి వారితో మాట్లాడారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగంపల్లి లతవేంకటేష్, గ్రామ పాలనాధికారి రాజేశ్వర్, మిషన్ భగీరథ. హెల్పేర్ పద్మ, ఆశా వర్కర్స్ పద్మ, అంగన్వాడీ టీచర్ రాజమణి, పద్మ, ప్రత్యేక అధికారి పంచాయతీ సెక్రటరీ ప్రదీప్ కుమర్, అవునూరి సత్తయ్య పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాలో ఇచ్చోడ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**ఇచ్చోడ, మార్చి 13, ప్రభాతవార్త:**




ఆదిలాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ నెల 10న ఈ మేళాలో కళాశాల నుండి 15 మంది విద్యార్థులు పాల్గొనగా, ముగ్గురు విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆచ్చి శ్రీనివాస్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిలో రాంచరణ్ (బి.కామ్), రాథోడ్ ప్రభాస్ (బి.కామ్), కరుణ (బి.ఎస్‌సి) ఉన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులను అభినందిస్తూ.. ఉద్యోగ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూనే, ఉన్నత విద్యను కొనసాగించాలని సూచించారు. సంపాదించిన ఆదాయాన్ని పొదుపు చేస్తూ కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ సమన్వయకర్త టి. నర్సయ్య, అధ్యాపకులు డాక్టర్ సరస్వతి, డాక్టర్ అనిత, డాక్టర్ సరితారాణి, డాక్టర్ మురళి, దయాకర్, డాక్టర్ తిరిపతి, ప్రభాత్ రావు, డాక్టర్ మధుసుభాష్, విజయలక్ష్మి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రంలో వసతులను పరిశీలిస్తున్న తహసీల్దార్

## విద్యార్థులకు పూర్తి సౌకర్యాలు కల్పించాలి: తహసీల్దార్ తిరుపతి

**- పదవ తరగతి పరీక్ష కేంద్రం పరిశీలన**

**పెంచికల్ పేట్, మార్చి 13, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ తిరుపతి శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రంలోని ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు ఎటువంటి అవంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని చీఫ్ సూపరిండెంట్ ను ఆదేశించారు. విద్యార్థులకు సరిపడ ఫర్నిచర్ ఏర్పాటు చేయడం, తాగునీటి సదుపాయం కల్పించడం, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పరీక్షలు సజావుగా జరిగేలా పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతంలో బి.ఎన్.ఎస్ 163 (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 144 )ఉత్తర్వులు అమల్లో ఉంటాయని తెలిపారు.ఈ తనిఖీలో ఆయన వెంట రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా హెల్త్ క్యాంపు

**పెంచికల్ పేట్, మార్చి 13, ప్రభాతవార్త :**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 14న (శనివారం) రోజున పెంచికల్ పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా హెల్త్ క్యాంపును నిర్వహించనున్నట్లు వైద్యధికారి ఆర్షిన్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీరోగ, పిల్లల వైద్య నిపుణులు, కంటి వైద్య, ఎముకలు కీళ్ళ వైద్య నిపుణులు, దంత వైద్య నిపుణులు, ఎండీ జనరల్ మెడిసిన్ నిపుణులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశన్ని వినియోగించుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ ఆర్షిన్ సూచించారు.



నాయబ్ తహసిల్దార్ కల్పనకు వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్

## ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

**తాండూర్, మార్చి 13, ప్రభాతవార్త :**

మండలంలోని మాదారం గ్రామ పంచాయతీలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని సర్పంచ్ కుశ్నపల్లి లక్ష్ముఋఋ ృణ్, ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి కోరారు. తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం నాయబ్ తహసిల్దార్ కల్పన కలిసి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలు, విద్యార్థులు వ్యయ ప్రయాసాలు పడి ఆధార్ అప్డేట్ కోసం బెల్లంపల్లికి వెళ్లి ఆధార్ అప్డేట్ చేసుకుంటున్నారని అన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మాదారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి ఆధార్ అప్డేట్ చేసుకుని అవకాశం కల్పించి న్యాయం చేయాలని వారు కోరారు.

## నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు

**ఉట్నూర్, మార్చి 13, ప్రభాత వార్త :**

శనివారం నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉట్నూర్ మండల కేంద్రంలో పదవ తరగతి విద్యార్థుల పరీక్షల కోసం నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో 200 మంది విద్యార్థులు పరీక్ష లు రాసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చీఫ్ సూప రింటెండెంట్గా రమేష్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్గా మనోజ్ఞ, గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల పరీక్ష కేంద్రానికి చీఫ్ సూప రింటెండెంట్గా మాణిక్రావు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్గా ప్రకాష్, పూలాజిబాబా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పరీక్ష కేంద్రలో ఏ మరియు బీ సెంట ర్లు ఏర్పాటు చేశారు. ఏ సెంటర్కు చీఫ్ సూప రింటెంట్గా తిరుపతి, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ గా వసంతరావు, బి సెంటర్ చీఫ్ సూపరింటెం ట్గా రమేష్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్గా సంతో ష్లను నియమించినట్లు మండల విద్యాధికారిరాపల్లి ఆశన్న తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం 45 మంది ఇన్విజిలేటర్లను నియమించా మన్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని నిర్వాహకులను ఆదేశించామ న్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యా హ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహి స్తారన్నారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా సాఫీగా జరిగేలా చర్యలు చేపడుతున్నమన్నారు.

## టోంకిని హనుమాన్ ఆలయంలో భక్తుల దీక్షలు

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 13, ప్రభాతవార్త:**

సిర్పూర్(టి) మండలంలోని టోంకిని గ్రామంలో ఉన్న శ్రీ సిద్ధి హనుమాన్ ఆలయంలో శుక్రవారం భక్తి పరవశం నెలకొంది. చింతగూడ కోయవాగు గ్రామానికి చెందిన సుమారు 15 మంది భక్తులు హనుమాన్ స్వామి దీక్షలను స్వీకరించారు. ఏప్రిల్ 2న జరగనున్న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారుల ఆధ్వర్యంలో హనుమాన్ స్వామికి అభిషేకాలు చేసి, మాలలు ధరించి దీక్షలు తీసుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు హనుమాన్ స్వామి ఆశీస్సులతో కుటుంబాల్లో శాంతి, సౌభాగ్యాలు కలగాలని ప్రార్థించారు. దీక్షలు స్వీకరించిన భక్తులు హనుమాన్ జయంతి వరకు నియమ నిష్ఠలతో వ్రతాలు పాటించనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు జై హనుమాన్ నినాదాలతో భక్తి వాతావరణం నెలకొంది. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురు స్వామి సురేష్, మోహన్ గురు స్వామి, కోట నరేష్, మురుకుట్ల రమణ, పిరిసింగుల వినోద్, బాలకృష్ణ, జెల స్వామి, శిరీష్ స్వామి, సంపత్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్ మాలలు ధరించిన భక్తులు

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

**- మహిళలకు రక్షణ చట్టాలు అమలు చేయాలి**

**- భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామికమైన దినోత్సవ సదస్సు**

**వాంకిడి, మార్చి 13, ప్రభాతవార్త :**

వాంకిడి మండలం చరిడి గ్రామంలో అంతర్జాతీయ స్థానిక మహిళా దినోత్సవం సదస్సు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అమృత డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, గొడిసెల కార్తీక్, మాజీ ఎంపిటిసి వీణ బాయ్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి 1908 సంవత్సరంలో ఏర్పడి కార్మిక ఉద్యమం నుండి పుట్టింది అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఇప్పటికి 109 అంతర్జాతీయ మహిళా వేడుకలు జరుపుకుంటున్న క్లరాజెన్ అనే మహిళ అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరపాలని ఆలోచన తక్కువ పని దినం ఓటు హక్కు మెరుగైన జీతం మహిళలు రాజకీయం ఉద్యోగ ఉపాధి రంగాలలో ముందు ఉండాలని తమ హక్కుల కోసం ఉద్యమించాలని అన్నారు, అంతేకాదు మహిళలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సక్రమంగా రిజర్వేషన్లు అమలు చేయాలని వీటితోపాటు సమాన వేతనం ఇవ్వాలని అదేవిధంగా ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించాలని మహిళా చట్టాలను పకడ్ బంధిగా అమలు చేయాలని మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అనంతరం అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించి మహిళలు కేక్ కట్ చేశారు, మహిళలకి శాలువులతో సత్కరించారు, ఈ కార్యక్రమంలో మాలి సంఘం జిల్లా అధ్యక్షులు సండే వాసు దేవ్ డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు దుర్గం నిచల్ వడ్లూరి శ్రీకాంత్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వడ్లూరి మల్లేష్, జిల్లా నాయకులు వెంకటేష్ గ్రామ పటేల్ సంతోష్ హనుమాన్ మందిర్ మహారాజ్ బాలాజీ డ్వాక్రా మహిళా సంఘం అధ్యక్షురాలు విములబయి అష వర్కర్ వడ్లూరి లక్షీ ్మ అంగన్వాడి టీచర్ లింబున పాల్గొన్నారు.



మహిళలను శాలువాతో సన్మానిస్తున్న డివైఎఫ్ఐ సంఘ నాయకులు




## ఇందారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడికి ధర్మనిధి రాష్ట్ర స్థాయి పురస్కారం

**జైపూర్, మార్చి 13, ప్రభాతవార్త**



మండలంలోని ఇందారం ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గోపగాని రవీందర్‌కు డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య ధర్మనిధి రాష్ట్రస్థాయి పురస్కారాన్ని ప్రధానం చేయనున్నట్లు తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు పాఠాలను బోధిస్తూనే సమాజ చైతన్యం కోసం గత మూడు దశాబ్దాలుగా సాహితీ రంగంలో విశేషమైన కృషి చేస్తున్నందుకు గాను ప్రతిష్టాత్మకంగా అందించే ఈ పురస్కారానికి గాను రవీందర్‌ను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. కవిగా, రచయితగా, విమర్శకుడిగా, కథకుడిగా సాహితీ సంస్థల నిర్వాహకుడుగా రవీందర్ కృషి చేస్తూనే ఐదు కవితా సంపుటాలను, మూడు వ్యాస సంకలనాలను ప్రచురించారని ఆయన తెలిపారు. తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ఇతర సాహితీవేత్తల చేతుల మీదుగా ఈ నెల 17న ఈ పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి బి.శ్రీనివాస్‌తో పాటుగా సహచర ఉపాధ్యాయులు, జిల్లాలోని పలువురు కవులు రచయితలు గోపగాని రవీందర్‌కు అభినందనలు తెలిపారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన డి ఈ ఓ గణేష్

**ఉట్నూర్, మార్చి 13, ప్రభాత వార్త:**

మండలంలోని లాల్ టెక్డి ప్రభుత్వ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని డి ఈ ఓ గణేష్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గదుల్లో వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పరీక్షా కేంద్రం సీఎస్ శంకర్, డీవో సుజాత, రాజేందర్, తదితరులు ఉన్నారు.

## రక్షణతో కూడిన ఉత్పత్తే యాజమాన్యం లక్ష్యం

**- కేకే-5 గని సందర్శించిన కార్పొరేట్ జీఎం సేఫ్టీ సాయిబాబా**

**మందమర్రి, మార్చి 13, ప్రభాతవార్త**

సింగరేణి మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిని శుక్రవారం కార్పొరేట్ జీఎం సేఫ్టీ సాయిబాబా సందర్శించారు. ఈ సందర్భంగా గనిలో జరుగుతున్న ఉత్పత్తి పనులు, భద్రతా చర్యలు, రక్షణ ప్రమాణాలపై సమీక్ష నిర్వహించారు. గని మేనేజర్ శంభూనాథ్ పాండే నుండి గనికి సంబంధించిన ఉత్పత్తి లక్ష్యాలు, భద్రతా చర్యలు, కార్మికుల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జీఎం సేఫ్టీ సాయిబాబా మాట్లాడుతూ రక్షణతో కూడిన ఉత్పత్తే సింగరేణి యాజమాన్యం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రమాదాలు లేని సింగరేణిని నిర్మించడమే ధ్యేయంగా అధికారులు, ఉద్యోగులు సమిష్టిగా అంకితభావంతో పని చేయాలని సూచించారు. యాజమాన్యం ఎప్పటికప్పుడు భద్రతకు పెద్దపీట వేస్తోందని, పనిలో ఏకాగ్రతతో వ్యవహరిస్తే ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. కేకే-5 గని భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ఉత్పత్తిలో కూడా మంచి రికార్డులు సాధించాలని సూచించారు. ప్రతిరోజూ రక్షణ సూత్రాలను ఖచ్చితంగా పాటిస్తూ పని చేయడం ద్వారా ఎలాంటి ప్రమాదాలు సంభవించవని ఆయన పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రక్షణ చర్యలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి కేవలం 15 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందని, ఈ కాలంలో లక్ష్యాలను పూర్తి చేయడంతో పాటు అదనపు ఉత్పత్తి సాధించి రికార్డులు నెలకొల్పాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. అనంతరం ఆయన గనిలోకి దిగిపోయి పని స్థలాలను పరిశీలించి ఉద్యోగులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ జీఎం సేఫ్టీ రఘుకుమార్, మందమర్రి ఏరియా రక్షణ అధికారి భూ శంకరయ్య, కేకే-1 గ్రూప్ ఏజెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను సందర్శించిన సివిల్ జనరల్ మేనేజర్

జైపూర్, మార్చి 13, ప్రభాతవార్త

సింగరేణి సివిల్ జి.ఎం వెంకటేశ్వర్లు, సివిల్ ఏ.జి. ఎం నవీన్ తో కలిసి శుక్రవారం జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ను సందర్శించారు.సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ జనరల్ మేనేజర్ నరసింహ రావు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సివిల్ జి.ఎం డి వెంకటేశ్వర్లు 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణ పనులను స్వయంగా పర్యవేక్షించి, ప్లాంట్ లో నిర్మించబోయే కూలింగ్ టవర్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న వివిధ పనులకు సంబంధించిన వివరాలను ప్రాజెక్టు డైరెక్టర్ బి.హెచ్.ఈ.ఎల్ మధు కిరణ్, పి.ఎం.పి.ఎల్. అధికారులు కే.పి.సి. అధికారులు తెలియజేశారు. 800 మెగావాట్ల ప్లాంట్ ప్రస్తుత స్థితిగతులను సివిల్ ఎస్.ఈ బానోతు రాము ప్లానింగ్ డయాగ్రమ్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సివిల్ జి. ఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణ పనుల పట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తూ ఈ నిర్మాణ పనులను ఇదే విధంగా మంచి నాణ్యతతో మరింత త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ పర్సనల్ డీజీఎం కిరణ్ బాబు, సివిల్ ఎస్.ఈ బి. రాము, సివిల్ ఎస్.ఈ పాత్రుడు ఇతర సివిల్ అధికారులు అలాగే ఇతర అధికారులు, బీహెచ్ఈఎల్ పి.ఎం. పి.ఎల్.కే.పి.సి అధికారులు పాల్గొన్నారు.





కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

## టీచర్ బలిరామ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

ఉట్నూర్,మార్చి 13,ప్రభాత వార్త :

మండలంలోని నవోదయనగర్ కి చెందిన ఆత్రం గంగుబాయి బిడ్డకు జన్మనిచ్చి స్వర్గస్తులయ్యారు గత నాలుగు నెలల క్రితం ఆమె భర్త కూడా చనిపోవడం తో అనాథలైనా పిల్లలు, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం వారి ఇంటికి చేరుకొని చిన్న పిల్లలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు, ఎలాంటి అవసరం ఉన్న తెలియజేయాలని ఐదు వేళ రూపాయల ఆర్థిక సహాయం చేశారు.ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన టీచర్ బలిరామ్ కుటుంబాన్ని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చారు . ఈ కార్యక్రమంలో స్థానికులు, కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలి

జన్నారం, మార్చి 13, ప్రభాతవార్త

విద్యార్థులు చదువుతో పాటు మంచి క్రమశిక్షణను అలవర్చుకోవాలి అని పొనకల్ గ్రామ సర్పంచ్ జక్కు సుష్మా భూమేష్ అన్నారు. జన్నారం మండలంలోని పొనకల్ మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడుకోలు సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టపడి చదవాలని, మనం జీవితంలో ఏం సాధించాలన్న విద్య అత్యంత ప్రాముఖ్యమని, విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృృతిక కార్యక్రమాల్లో, క్రీడా రంగాల్లో రాణించాలని అన్నారు. పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రైమరీ పాఠశాలలో ఎన్నడూ లేని విధంగా వీడ్కోలు సమావేశం నిర్వహించడం చాలా అభినందించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ కుమారి, పొనకల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్,ఉపాధ్యాయులు జయమణి, భాగ్యలక్ష్మి, ప్రవల్లిక, ఐ.ఇ.ఆర్ సి కోఆర్డినేటర్ నారాయణ, సిఆర్‌పిలు శేఖర్, దయాకర్, బుచ్చన్న, అజీజుద్దీన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు

- మండలంలోని మూడు సెంటర్లలో పరీక్షలు రాయనున్న 652 మంది విద్యార్థులు
- ఉదయం 9 గంటలకు పరీక్ష హాల్లో ఉండాలి: ఎంఈఓ సత్యనారాయణ

చెన్నూరు, మార్చి 13, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా స్థానిక చెన్నూరు పట్టణంలో నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని మండల విద్యాధికారి కేవి సత్యనారాయణ తెలిపారు. పరీక్షలు రాసే వారిలో బాలికలు 312 బాలురు 340 మొత్తం 652 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షలు నిర్వహించేందుకు మూడు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 220, కేజీబీవీలో 230, అస్సీసీ స్కూల్‌లో 202 మొత్తం 652 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు పరీక్ష హాల్లో ఉండాలన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామని, విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి: ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ దేవనబోయిన బాపు

వేమనపల్లి, మార్చి 13, ప్రభాతవార్త

ఎన్ హెచ్ఎం పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ రావలసిన 5 నెలలు పెండింగ్‌లో ఉన్న వేతనాలు రాక ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వేతనాలు చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర డిప్యూటీ సెక్రెటరీ దేవనబోయిన బాపు యాదవ్ కోరారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అన్వేష్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌హెచ్ఎం ఉద్యోగులందరికీ ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనాల లేక ఆర్థిక ఇబ్బందులు అనగా ఇంటి కిరాయి, కరెంట్ బిల్లు, పాల బిల్లు, పిల్లల బడి ఫీజులు, ఈఎంఐలు కట్టలేని దీన పరిస్థితిలో ఉద్యోగులు ఉన్నారని తెలియజేశారు.

కాబట్టి వెంటనే ఉద్యోగులకు రావలసిన 5 నెలలు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మెడికల్ ఆఫీసర్ ఈ నెల 16 లోపు వేతనాలు చెల్లించలేని ఎడల 17వ తేదీ నుంచి లంచ్ సమయంలో నల్ల రిబ్బన్ ధరించి నిరసన వ్యక్తం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి నర్సింగ్ ఆఫీసర్ శివరంజని పాల్గొన్నారు.



పరీక్షలు ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

## పదో తరగతి పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలి

తాండూర్, మార్చి 13, ప్రభాతవార్త :

మండలంలో శనివారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓ దుర్గం శ్రీనివాస్ అన్నారు. పరీక్షల కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 7 ప్రభుత్వ, 2 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 418 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందులో 227 మంది బాలురు, 191మంది బాలికలు ఉన్నారన్నారు. మండలంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 220 మంది, విద్యాభారతి ఉన్నత పాఠశాలలో 198 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగా చేరుకోవాలని సూచించారు. 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన పరీక్షకు అనుమతిస్తామన్నారు. పరీక్షలు చీఫ్ సూపరింటెండెంట్లుగావేణుగోపాల్, దామోదర్, డిపార్ట్ మెంట్ అధికారులుగా జేవిన్ సెల్వ, నరేందర్ రెడ్డి లను నియమించామన్నారు. పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల వరకు ఎవరు ఉండకూడదన్నారు. పరీక్షల నిర్వహణ సమయంలో జిరాక్స్ సెంటర్లు బంద్ చేయాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద తాగునీరు,గాలి వెలుతురు ఉండేలా ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

## ఏజెన్సీ దళితులను ఆదుకోవాలి

ఉట్నూర్,మార్చి 13,ప్రభాతవార్త:

జిల్లా ఏజెన్సీ షెడ్యూల్డ్ కులాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నివాసంలో కమిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానం చేశారు.గతంలో ఏజెన్సీ షెడ్యూల్డ్ కులాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన పోరాటాలు, దీక్షల గురించి వివరించి, ఏజెన్సీ ప్రాంత దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్ముుుుు మ్రణ్ కుమార్ దృష్టికి ఏజెన్సీ ప్రాంతంలోని దళితుల అసైన్‌మెంట్ భూముల సమస్యలు, పహాణీలు, బ్యాంకు రుణాలు, రైతుబంధు వంటి ప్రభుత్వ పథకాలు ఏజెన్సీ దళితులకు కూడా వర్తింపజేయాలని కోరారు. డ్వాక్రా గ్రూపుల సభ్యులకు బ్యాంకు లింకేజీ లేకుండా రూ.20 లక్షల రుణాలు ఇవ్వాలని, ప్రతి దళిత కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి అడ్లూరి లక్ష్ముుుుు మ్రణ్ కుమార్ త్వరలోనే ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంత దళితుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చినట్లు యాక్షన్ కమిటీ నాయకులు తెలిపారు.మంత్రిని కలిసిన వారిలో ఏజెన్సీ షెడ్యూల్డ్ కులాల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు బిరుదుల లాజర్, అరకిల్లా అశోక్, దుట రాజేశ్వర్, కాడమాండ్ల రాజమణి, కొల్లూరి స్వామి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న దళిత నాయకులు